క్లుప్తంగా

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: పట్టణానికి చెందిన విజ్ఞాన్ పాఠశాల విద్యార్థిని బోయ ఉమామహేశ్వరి జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ మోహన్, ప్రధానోపాధ్యాయురాలు ఉషాపరిమళలు శుక్రవారం తెలిపారు. మూడు రోజులుగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగి అండర్ 19 రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో వ్యక్తిగత ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ మేరకు విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సతీష్, కేశవ, రవికుమార్, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భూములు ఇవ్వాలని జేసీ బెదిరించడం తగదు

కర్నూలు(సెంట్రల్): ఆలూరు మండలం మనేకుర్తి గ్రామ రైతులను పవర్‌గ్రిడ్ ప్రాజెక్టు కోసం భూములు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య బెదిరించడం న్యాయం కాదని, బలవంతంగా భూసేకరణ చేస్తే అన్నదాతల నుంచి తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తుందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. సారవంతమైన 195 ఎకరాలను బలవంతంగా ఇవ్వాలనడం భావ్యం కాదన్నారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభలో 90 శాతం మంది రైతులు వ్యతిరేకించినా భూములు ఇవ్వాలని బెదిరించడం అన్యాయమన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం 80 శాతం మంది రైతులు అంగీకరిస్తేనే ప్రాజెక్టుల కోసం భూములు తీసుకోవాల్సి ఉంటుందని, ఆ విషయాన్ని జేసీ తెలుసుకోవాలన్నారు.

రేపు వరల్డ్ హార్ట్ డే

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులో ఈ నెల 28వ తేదీన జరగనున్న వరల్డ్ హార్ట్ డే వేడుకలను జయ ప్రదం చేయాలని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2002 నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2011లో కర్నూలు హెల్త్ క్లబ్ స్థాపించి ప్రతి నెలా వైద్య అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ యేడాది వరల్డ్ హార్ట్ డే సందర్భాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ అపోలో హాస్పిటల్‌కు చెందిన కార్డియాలజిస్టు డాక్టర్ ప్రతాప చంద్రకు అవుట్ స్టాండింగ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 11.30 గంటలకు స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరవుతున్నట్లు తెలిపారు.

బాల సాహిత్య పురస్కారానికి ఎంపిక

కర్నూలు కల్చరల్: సి.బెళ గల్ మండలం పాలకల్ జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, ప్రముఖ బాల సాహితీవేత్త పుల్లా రామాంజనేయులును సింహ ప్రసాద్ సాహిత్య సమితి వారి డాక్టర్ వేదగిరి రాంబాబు బాల సాహిత్య పురస్కారం-2025కు ఎంపిక చేసినట్లు సమితి కన్వీనర్ సింహ ప్రసాద్ పేర్కొన్నారు. అక్టోబర్ 14న హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగే సభలో తెలంగాణ ప్రభుత్వం పూర్వ సలహాదారు కె.వి.రమణాచారి చేతుల మీదుగా పురస్కార ప్రదానం ఉంటుందని తెలిపారు. పురస్కారం కింద రూ.5 వేలు నగదు, మెమెంటోతో పాటు ఘన సత్కారం ఉంటుందని పేర్కొన్నారు. పురస్కారానికి ఎంపికైన రామాంజనేయులుకు పలువురు సాహితీ వేత్తలు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఈతకు వెళ్తున్నారా? తస్మాత్ జాగ్రత్త!

కర్నూలు: దసరా సెలవుల నేపథ్యంలో యువకులు, విద్యార్థులు ఈతకు వెళ్లడం వల్ల ప్రమాదకర ఘటనలు జరిగే అవకాశమున్నందున జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని గ్రామాలు, పట్టణ శివారులో వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, కాల్వలు పూర్తిగా నిండిపోయాయని, తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో తల్లిదండ్రులు గమనించి జాగ్రత్తలు తీసుకోవాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నదీ తీర ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా, ఏవైనా సమస్యలు ఉంటే 112కు డయల్ చేసి సమాచారం అందించాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆపదలు, అత్యవసర పరిస్థితులు, అసాంఘిక కార్యకలాపాలు, ఏ సమస్య అయినా 112కి కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

అమ్మవారికి ఆభరణాల విరాళం

మద్దికెర: స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో కొలువైన పార్వతీదేవికి గుంతకల్లు పట్టణానికి చెందిన సుంకు పంపావతి జ్ఞాపకార్థం భార్య సుంకు శారద, కుమారుడు ఇందీష్ రూ.లక్ష విలువజేసే కాసుల హారం, జడపట్లు, కుచ్చుల బంగారు ఆభరణాలను శుక్రవారం అందజేశారని ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలిపారు. అనంతరం ఆభరణాలను అమ్మవారికి అలంకరించారు.



కోసిగి: మహాలక్ష్మిదేవిగా దర్శనమిస్తున్న శాంభవిదేవి



కౌతాళం: మహాలక్ష్మిదేవిగా చౌడేశ్వరిదేవి




ఆదోని: లలితా పరమేశ్వరి రూపంలో



ఆకు, వక్కల అలంకారంలో శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ



లక్ష్మీదేవిగా దర్శనమిస్తున్న వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి



ఆదోని.. ఎమ్మిగనూరు రోడ్డులో ధనలక్ష్మిగా భవానీదేవి



నోట్లు, నాణేలతో శ్రీపేట వీరభద్రేశ్వరస్వామి



సోమలగూడూరు.. మహాలక్ష్మీదేవి అలంకారంలో

ధనలక్ష్మీ.. కటాక్షించు!

ఆదోని అర్బన్: శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా ఆదోని పట్టణంలో ఐదోరోజు శుక్రవారం వివిధ అలంకరణలో దర్శనమిచ్చారు. ఆకు, వక్కల అలంకరణలో శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ, లక్ష్మీదేవి అలంకరణలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు, లలితా పరమేశ్వరి అలంకారంలో ఫారెస్ట్‌లైన్ అంబాభవానీ మాత, కరెన్సీ నోట్లు, నాణేల అలంకరణలో శ్రీ పేట వీరభద్రేశ్వరస్వామి, శ్రీలలితా పరమేశ్వరి అలంకారంలో ఎంఎం కాలనీలోని వెలిసిన శ్రీ మాతా పరమేశ్వరిదేవి దర్శనమిచ్చారు. ఎమ్మిగనూరు రోడ్డులో వెలిసిన గంగాభవానీదేవి ధనలక్ష్మి అలంకరణలో దర్శనమివ్వగా, అమరావతి నగర్‌లో దుర్గామాతను కొలువుదీరారు. అలాగే శ్రీపేట వీరభద్రస్వామి ఆలయంలో దుర్గామాత ముందు భక్తులు రంగురంగుల ముగ్గులు వేశారు.

భక్తిశ్రద్ధలతో పూజలు..

కోసిగి/కౌతాళం/నందవరం: కందుకూరు గ్రామంలో వెలసిన శాంభవిదేవి మహాలక్ష్మిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు మల్లికార్జునస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకారణ గావించి ఆకుపూజ, అర్చన సహిత మహా మంగళహారతులతో ప్రత్యేక పూజలు చేపట్టారు. కౌతాళంలోని వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారిని మహాలక్ష్మిదేవిగా దర్శనమిచ్చారు. గురజాలలో రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పురోహితులు హంపేష్ స్వామి ఆధ్వర్యంలో రామలింగేశ్వర స్వామికి, పార్వతీదేవికి విశిష్ట పూజలు గావించారు. సోమలగూడూరు గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయంలో పురోహితులు శ్రీధర్‌రావు స్వామి ఆధ్వర్యంలో భక్తులు పెద్దమ్మ దేవిని మహాలక్ష్మీ దేవిగా అలంకరించారు. రూ. 500 నోట్లు, రూ.200 నోట్లు, రూ.100 నోట్లతో పాటు నాణేలతో అమ్మవారిని అలంకరించారు. నందవరంలో బంగారమ్మ దేవి ప్రత్యేకాలంకరణలో భక్తులు దర్శనమిచ్చారు.



మంత్రాలయం రూరల్: మంత్రాలయంలోని వాసవీ కల్యాణ మంటపంలో కొలువైన వాసవీమాతను శుక్రవారం మహాలక్ష్మిగా అలంకరించారు. కరెన్సీ నోట్లతో ఎంతో సుందరంగా అమ్మవారిని అలంకరించారు.

ధనలక్ష్మినమోస్తుతే!



పెద్దకడబూరు: దొడ్డిమేకలలో వెలసిన పార్వతీదేవి అమ్మవారు ధనలక్ష్మిదేవిగా, మహాలక్ష్మిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని చిన్న లక్ష్మమ్మవ్వ, పెద్ద లక్ష్మమ్మవ్వతో పాటు మండల పరిధిలోని చిన్న తుంబళం, బాపురం గంగమ్మవ్వ అమ్మవార్లు వివిధ రూపాల్లో కొలువై పూజలందుకున్నారు.

మంచాలమ్మ కరుణించు..



మంత్రాలయం: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మంత్రాలయం గ్రామ దేవత మంచాలమ్మ ధనలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. సూర్యోదయానే అర్చకులు గ్రామ దేవతకు కరెన్సీతో ఎంతో వైభవంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి అభిషేకాది అర్చనలు చేపట్టి హారతులు చేపట్టారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



తిమ్మారెడ్డి బస్టాండు ప్రాంతంలో ఏర్పడిన గుంతలను పూడుస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆదోని టౌన్: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా-2025లో భాగంగా శుక్రవారం పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండు రహదారిలో ఉన్న గుంతలను మున్సిపల్ సిబ్బందితో కలిసి పూడ్చారు. ఎక్కడైనా పారిశుద్ధ్యం లోపిస్తే వెంటనే మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందించాలని కమిషనర్ ప్రజలకు సూచించారు. వర్షాల కారణంగా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. రాత్రివేళల్లో దోమతెరలను వాడాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, బీజేపీ నాయకులు విట్టా రమేష్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఆదోని సెంట్రల్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ డిల్లీశ్వరి అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 8వ రాష్ట్రీయ పోషణ మహా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలతో పాటు పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల పిల్లల వరకు రక్తహీనత బారిన పడకుండా ప్రభుత్వం పోషకాహారం అందిస్తుందన్నారు. అక్టోబర్ 16వ తేదీ వరకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఈ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: గర్భిణులు సమతుల్యమైన ఆహారం తీసుకోవడంతో పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ రాజేశ్వరిదేవి అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ప్రధానమంత్రి పోషణ అభియాన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీసూపర్‌వైజర్ విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులు

ఎమ్మిగనూరుటౌన్: సచివాలయ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని స్థానిక వార్డు సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి రవికిరణ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి హంపిరెడ్డి, కోశాధికారి రజిని, పబ్లిసిటీ కార్యదర్శి ఆకిఫ్ ఖురేషి డిమాండ్ చేశారు. రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు.. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వానికి నివేదించాలని కోరుతూ వినతి పత్రాన్ని ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇదివరకే సమస్యలపై ప్రభుత్వానికి ఇచ్చిన గడువు 15 రోజులు ముగిసిందన్నారు. అయినా ఆయా సమస్యలపై ప్రభుత్వం చర్చలకు పిలవలేదన్నారు. సెలవురోజుల్లో కూడా విధులు నిర్వర్తించాలని ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.25 లక్షల మంది సచివాలయ ఉద్యోగులు ఆయా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

ఉద్యోగుల పని విధానంలో మార్పు రావాలి



ఆలూరు- 2 సచివాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డా.ఎ .సిరి

ఆలూరు: గ్రామ,వార్డు సచివాలయాల ఉద్యోగుల పని విధానంలో మార్పు రావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. శుక్రవారం హొళగుంద మండలం దేవరగట్టులో జరిగే బన్ని సమరంపై వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం స్థానిక 2వ, సచివాయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఉద్యోగులతో మాట్లాడారు. నిత్యం తాగునీరు, శానిటేషన్ మెరుగుపరచడం, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడం, బాలింతలు,గర్భిణులకు పోషకాహారం లోపాలు తలత్తకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలతో సమావేశాలను నిర్వహించి నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ తదితరులు ఉన్నారు.

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

కర్నూలు కల్చరల్: జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో 45వ ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక, సాంస్కృతిక శాఖ అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు.

29న లోక్ కల్యాణ్ మేళా

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పీఎం స్వనిధి యోజన కార్యక్రమంలో భాగంగా ఈనెల 29వ తేదీన లోక్‌కల్యాణ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి శుక్రవారం తెలిపారు. వీధి వ్యాపారులకు ఈ పథకం కింద రూ.15వేల నుంచి రూ.50 వేల వరకు రుణాలను వివిధ బ్యాంకుల ద్వారా మంజూరు చేయించడం జరుగుతుందన్నారు. అర్హత ఉన్న వీధి వ్యాపారులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.

క్యాంటీన్ పరిశీలన..

శ్రీనివాస సర్కిల్‌లోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. భోజన నాణ్యత గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్‌లో శుభ్రత ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎద్దుల మార్కెట్ వద్ద అనాథగా జీవిస్తున్న ఈడిగ వసంతమ్మ అనే వృద్ధురాలు మృతి చెందడంతో శుక్రవారం పలు ప్రజా, స్వచ్ఛంద సంస్థల సభ్యులు బీసీ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కామలే గణేష్, మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, సింగనేటి నర్సన్న, ఎంకోబ తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన



పత్తి పంటకు సోకిన తెగుళ్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు రాఘవేంద్ర, ఏడీఏ బాలవర్ధిరాజు

ఆదోని రూరల్: భారీ వర్షాలకు తెగుళ్ల బారిన పడిన పత్తి పంటలను శుక్రవారం నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రాఘవేంద్ర, బి.హెచ్.చైతన్య, అశోక్‌కుమార్, ఏడీఏ బాలవర్ధిరాజు, ఏఓ సుధాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు నివారణ చర్యలు గురించి వివరించారు. కాయ దశలో వర్షాలు ఎక్కువైతే కాయలు కుళ్లిపోవడం జరుగుతుందన్నారు. కాయతొలుచు పురుగుల రంధ్రాల ద్వారా శిలీంద్రాలు ప్రవేశం మొదటగా కాయల మీద చిన్నని గోధుమ లేదా నలుపు లేదా గోధుమ, నలుపు రంగు మచ్చలు ఏర్పడతాయన్నారు. ఆ తర్వాత కాయ మొత్తానికి వ్యాపిస్తాయన్నారు. ఈ కుళ్లు కాయ లోపల ఉన్న విత్తనాలు, పత్తికి కూడా వ్యాపిస్తుందన్నారు. ఈ కుళ్లు ఆశించిన కాయలు పూర్తిగా అభివృద్ధి చెందకుండానే పగిలి విచ్చుకుంటాయని, పత్తి నాణ్యత దెబ్బతింటుందన్నారు. నత్రజని ఎరువులను విచక్షణారహితంగా వాడరాదని, పొలంలో నీరు నిల్వకుండా బయటకు వెళ్లేలా చేయాలన్నారు. కాయకుళ్లు తెగులు ఆశించకుండా ముందు జాగ్రత్త చర్యగా కాపర్ ఆక్సీక్లోరైడ్ 25 గ్రాములు, స్ట్రెప్టోమైసిన్‌ను 1 గ్రాము పది లీటర్ల నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ క్షేత్ర పరిశీలనలో వ్యవసాయ విస్తరణాధికారి సతీష్ పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 33వ రేషన్ షాపులో శుక్రవారం లబ్ధిదారులకు తహసీల్దార్ శేషఫణి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా షాపుల్లో రేషన్ పొందవచ్చని సూచించారు. మండలంతో పాటు పట్టణంలో 49,851 రేషన్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ వాహిద్, మాజీ కౌన్సిలర్ దాదాసాహెబ్, జిలానిబాషా, డీలర్ల సంఘ అధ్యక్షుడు సోమలగూడూరు బాషా తదితరులు పాల్గొన్నారు.

కార్డుదారులు డబ్బులివ్వొద్దు

పెద్దకడబూరు: స్మార్ట్ రేషన్‌కార్డుల కోసం ఎవరూ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని తహసీల్దారు గీతాప్రియదర్శిని తెలిపారు. ఎవరైనా కార్డుదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్డుదారులు సచివాలయ ఉద్యోగుల ద్వారా తమ స్మార్ట్‌కార్డును పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ జెర్మియా, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పంపిణీ చేయండి

నందవరం : డిజిటల్ రేషన్ కార్డులు పేదలకు పకడ్బందీగా పంపిణీ చేయాలని వీఆర్వోలు, డీలర్లకు తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. డిజిటల్ రేషన్ కార్డులు మండలానికి 18,945 కార్డులు వచ్చాయని, వచ్చే నెల 1వ తేదీ వరకు ప్రతి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులను అందించాలన్నారు.

గోనెగండ్ల:పాత రేషన్ కార్డుల స్థానంలో కొత్త డిజిటల్ రేషన్ కార్డులను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని తహసీల్దార్ రాజేశ్వరి తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో 23,375 రేషన్ కార్డులు ఉన్నాయని, నేటి నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వచ్చి పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రఘువీర్, ఆర్ఐ రామయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



స్మార్ట్‌కార్డులను పంపిణీ చేస్తున్న తహసీల్దార్ శేషఫణి

ఆలయ అభివృద్ధికి కృషి

పెద్దకడబూరు: శిథిలావస్థకు చేరుకున్న అతి పురాతన చౌడేశ్వరిదేవీ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆయన చిన్నతుంబళం రాయల చెరువు సమీపంలో వెలిసిన చౌడేశ్వరిదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయుల కాలం నాటి పురాతన చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రైతువిభాగం నియోజకవర్గ అధ్యక్షుడు యల్లప్ప, ఇంటలెక్చువల్స్ వింగ్ అధ్యక్షుడు బ్రహ్మయ్య, మత్స్య సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ద వీరేష్, సొసైటీ కార్యదర్శి నరసింహమూర్తి, నాయకులు చిన్న వీరేష్, మహాదేవ, సోమప్పదని, లింగన్నగౌడ్ పాల్గొన్నారు.



చౌడేశ్వరిదేవి పూజల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి



రోడ్డంతా మడుగులే

ఆ రోడ్డు అంతే!

వర్షపు నీరు పారదు.. సమస్య తీరదు అన్న చందంగా మారింది.. కౌతాళం నుంచి బాపురం వైపు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పరిస్థితి. కౌతాళం నుంచి బాపురానికి వెళ్లే రోడ్డులో హనుమన్ నగర్ వద్ద పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షానికి గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నీరు పోయే మార్గం లేకపోవడంతో సమస్య తీవ్రమవుతోంది. కొంత దూరం గుంతలు.. మరి కొంత దూరం బురదమయంగా ఉండటంతో వాహనదారుల అవస్థలు అన్నీఇన్నీ కావు. అధికారులు స్పందించి కనీసం గుంతలను గ్రావెల్‌తో పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు. – కౌతాళం

ఎడతెరిపిలేని వానలు.. రైతన్నకు కష్టాలు

నందవరం: ఆరు గాలం శ్రమించే పంటలు పండిచే రైతన్నకు అల్పపీడనంతో కంటి మీద కునుక్కు లేకుండా పోయింది. వర్షం దంచికొడుతుడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఎడతెరిపిలేని వానలతో పత్తి పంటల్లో నీరు నిలచి నష్టపోతున్నారు. పత్తి పంటల్లో నీరు నిలిచిపోడంతో మొక్కలు ఎర్రబడిపోవడం, కాయలు కుళ్లి పోవడం, పురుగు పట్టడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. అలాగే నది తీర ప్రాంతాలైన నదికైరవాడి, గంగవరం, జొహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె, గురజాల, రాయచోటి తదితర గ్రామాలతో పాటు బోర్లు బావి వద్ద ముందుగా సాగు చేసిన పత్తి పంటలు భారీగా దెబ్బతిన్నాయి.

స్తంభించిన జనజీవనం

ఆదోని సెంట్రల్: బంగాళఖాతంలో ఎర్పడిన అల్పపీడనంతో ఆదోని డివిజన్ ప్రాంతంలో వర్షం ఎడతెరపి లేకుండా వాన కురుస్తోంది. శుక్రవారం తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు వాన కురుస్తూనే ఉంది. పనుల నిమిత్తం వెళ్లే ఉద్యోగులు, కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే వారు, చిరు వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు. ప్రధాన రహదారులతో పాటు వీధులన్నీ చిత్తడి చిత్తడిగా మారాయి. చల్లని వాతవరణంతో పాటు ఈదురు గాలులు వీయడంతో వృద్ధులు అస్వస్థతకు గురయ్యారు. రాగల 24 గంటల్లో అల్పపీడనం మరింత బలపడి 27, 28వ తేదీలలో మోస్తారు వర్షంతో పాటు 29వ తేదీ నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు చిరుజల్లులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని వాతవరణం శాఖ హెచ్చరిక జారీ చేయడంతో ప్రజలు మరింత అందోళనకు గురవుతున్నారు.



పెద్దకొత్తిలిలో వరి సాగు చేస్తున్న దృశ్యం